క్లుప్తంగా

17న మెగా వైద్య శిబిరం

పిడుగురాళ్ల రూరల్: కాటూరి మెడికల్ కాలేజీ సౌజన్యంతో గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో ఈనెల 17న తుమ్మలచెరువు ప్రాథమిక పాఠశాలలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మాజీ ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి తెలిపారు. జిల్లాలో మొదటిసారిగా అత్యాధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన బస్సులో వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. శిబిరంలో సాధారణ వ్యాధులు, గుండె, ఊపిరితిత్తులు, చర్మవ్యాధులు, ఎముకల సంబంధించిన సమస్యలు, కంటి శుక్ల పరీక్షలు, స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తారని తెలిపారు. అవసరమైన వారికి కంటి శుక్ల శస్త్ర చికిత్సలు ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు. శిబిరానికి వచ్చేవారు వెంట ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తీసుకు రావాలని ఆమె సూచించారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్



దాచేపల్లి : విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని తహసీల్దార్ కె.శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలోని బాలికల హాస్టల్‌ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. హాస్టల్లో తహసీల్దార్, ఎస్సై, వీఆర్‌వోల పేర్లు, ఫోన్ నెంబర్లు గోడలపై రాయించాలని ఆదేశించారు. నాసిరకం ఆహార పదార్థాలను విద్యార్థులకు అందిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పరిశీలనలో శరత్ కుమార్ ఉన్నారు. అనంతరం దాచేపల్లిలోని కౌజుల వాగు పొంగి ప్రవహించడంతో ఆ ప్రాంతాన్ని తహసీల్దార్ పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ సిబ్బందిని ఆయన ఆదేశించారు.

ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించనున్న ఎమ్మెల్యే

మాచర్ల: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి 44 పల్లె వెలుగు, 20 ఎక్స్‌ప్రెస్ బస్సులను మహిళల ఉచిత ప్రయాణానికి ఏర్పాటు చేసినట్లు మేనేజర్ బత్తుల వీరాస్వామి బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ప్రజా ప్రతినిధుల సమక్షంలో బస్సు సర్వీసులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 15న సాయంత్రం 5 గంటల నుంచి ఉచితంగా మహిళలు బస్సుల్లో ప్రయాణం చేయవచ్చని తెలిపారు. వెంట ఆధార్, ఓటరు, రేషన్ కార్డుల్లో ఏదో ఒకటి కలిగి ఉండాలని సూచించారు.

మాంసం విక్రయిస్తే చర్యలు

పిడుగురాళ్ల: పట్టణంలో ఆగస్టు 15న సందర్భంగా మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో హెచ్చరించారు. పట్టణంలోని హోటల్స్, రెస్టారెంట్లు యాజమాన్యంతో పాటు, చికెన్, మటన్, ఫిష్ , మాంస వ్యాపారులు కూడా అమ్మకాలు చేయరాదని ఆయన సూచించారు.

డ్రగ్స్ వల్ల రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుంది



విజయపురిసౌత్: డ్రగ్స్ వాడకం ఎంతో ప్రమాదకరమని రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని మాచర్ల రూరల్ సీఐ షేక్ నఫీజ్ బాషా అన్నారు. బుధవారం స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు 'డ్రగ్స్ వద్దు బ్రో' అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ వాడకం వలన జీర్ణ వ్యవస్థ, లివర్, ఊపిరితిత్తులు, గుండెపై ప్రభావం చూపుతుందని అన్నారు. జ్ఞాపకశక్తి క్షీణించి ఏకాగ్రత లోపిస్తుందని, మెదడు దెబ్బతిని మూర్ఛ, పక్షవాతం వంటి వాటి బారిన పడతారన్నారు. విద్యార్థులు వీటన్నంటికి దూరంగా ఉండి బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సోమ్లానాయక్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కేజీబీవీలో గెస్ట్ ఫ్యాకల్టీలకు దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల విద్యా శాఖ సమగ్ర శిక్ష సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 7 బోధనా సిబ్బంది పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డి.రేవతి బుధవారం తెలిపారు. టైప్ 3 కేజీబీవీలలో గణితం, పీఎస్, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, కామర్స్ సబ్జెక్ట్‌ల్లో ఒక్కొక్క పోస్ట్ ఖాళీగా ఉన్నట్లు వివరించారు. అర్హులు ఈ నెల 14వ తేదీ నుంచి 18వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సమగ్ర శిక్ష కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9440642122 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.



దాచేపల్లి - మాచర్ల హైవేపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



దాచేపల్లిలో నీటి మునిగిన పంటలు



చర్లగుడిపాడు వద్ద లోలెవల్ చప్టాపై ప్రవహిస్తున్న నీరు



చర్లగుడిపాడు సమీపంలో కొట్టుకు పోయిన రోడ్డు

వరద బీభత్సం.. అతలాకుతలం

- ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం
- పొంగి ప్రవహిస్తున్న వాగులు, కాలువలు
- పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- వర్షపు నీటిలో మునిగిన పంటలు

దాచేపల్లి : విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం వాగులు, కాలువలు పొంగి ప్రవహించాయి. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. దాచేపల్లి- కారంపూడి రోడ్డులోని కేసానుపల్లి వద్ద వాగు నీరు రోడ్డుపై నుంచి ప్రవహించడం వల్ల రాకపోకలు స్తంభించాయి. దాచేపల్లి -మాచర్ల హైవే రోడ్డులో నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద వర్షపు నీరు రోడ్డు పైకి చేరుకోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమీపంలో ఉన్న కనకదుర్గ అమ్మవారి దేవాలయంలోకి వర్షపు నీరు చేరింది. సమీప పంట పొలాలు బాగా దెబ్బతిన్నాయి. పత్తి పంటపై నుంచి వర్షపు నీరు పారటం వల్ల రైతులకు అపార నష్టం కలిగింది. దాచేపల్లిలోని కాటేరు వాగు ఉధృతంగా ప్రవహించింది. భారీ వర్షాలతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.

తడిసి ముద్దాయిన గురజాల

గురజాల : మండలంలో బుధవారం తెల్లవారు జాము నుంచి భారీ వర్షం కురిసింది. మంగళవారం మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో ఎండ రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. బుధవారం తెల్లవారు జాము నుంచి వర్షం కురుస్తూనే ఉంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారిపై వర్షం నీరు నిలవడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

నీట మునిసిన పంట పొలాలు

పంట పొలాల్లో నీరు నిలిచింది. రైతులు నీటిని బయటకు పంపే పనిలో నిమగ్నమయ్యారు.వరి నాట్లు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. పత్తి పంటకు నీరు అధికమైంది. కాయ కుళ్లు వస్తుందని రైతులు వాపోతున్నారు. అయితే, అతివృష్టి లేకపోతే అనావృష్టి అనే రీతిలో ప్రకృతి ఉందని వాపోతున్నారు.

రాకపోకలకు ఆటంకం

బుధవారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షానికి రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. వాగులు పొంగి ఒక్కసారిగా రోడ్డుపై ప్రవహించడంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గురజాల - కారంపూడి రహదారిలో చర్లగుడిపాడు వద్ద లోలెవల్ చప్టాపై వర్షపు నీరు నిలిచి, రోడ్డుపైకి చేరింది. దీంతో భారీ వాహనాలు ఆటువైపుగా రాకుండా సీఐ భాస్కర్‌రావు చర్యలు చేపట్టారు. బ్రిడ్జి నిర్మాణం చేస్తుండటంతో ఆ ప్రాంతలో కూడా నీరు అధికంగా చేరింది. దీంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. గురజాలలోని దండివాగు కూడా ఉధృతంగా ప్రవహిస్తోంది.



దాచేపల్లి కాటేరు వాగులో ప్రవహిస్తున్న నీరు

పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

పిడుగురాళ్ల రూరల్: వాగులు, వంకలు పొంగి పొర్లడంతో పంట పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరి, పత్తి, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి.మండలంలోని పెద్ద అగ్రహారం, తుమ్మల చెరువు, వీరాపురం, గుత్తికొండ గ్రామాల్లో వరి పంట కొట్టుకుపోయింది. ఎడతెరపిలేని వర్షాల కారణంగా జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారుల పైకి వరద నీరు రావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో వైపు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. జూలకల్లులో కొత్త బ్రిడ్జి నిర్మాణం వద్ద రోడ్డుపైకి నీరు చేరడంతో పిడుగురాళ్ల-కారంపూడి రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గుత్తికొండలో వరద నీరు రోడ్డు పైకి ప్రవహించడంతో నరసరావుపేట, కారంపూడి వెళ్లే వాహనాలకు అంతరాయం ఏర్పడింది. కామేపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల మధ్య రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తోంది.



కొత్తపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీ చుట్టూ వర్షపు నీరు

పొంగి ప్రవహిస్తున్న వాగులు

రెంటచింతల: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోలి గ్రామ శివారులోని వాగు బ్రిడ్జిపై ఐదు అడుగుల మేర నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొత్త పాలువాయి- పాత పాలువాయి గ్రామాల మధ్య, పశర్లపాడు గ్రామ సమీపంలో పిల్లి వాగు ప్రమాదభరితంగా ప్రవహించడంతో, పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏడు మంగళం వాగు పొంగి ప్రవహించడం వల్ల రెంటాల, రెంటచింతల, మిట్టగుడిపాడు గ్రామాల్లో సుమారు 80 ఎకరాలకు పైగా వరి పంట ముంపునకు గురైంది. మిట్టగుడిపాడు గ్రామ శివారులో నేంద్ర వాగు పొంగడంతో గోలి, మిట్టగుడిపాడు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. తహసీల్దార్ దొప్పలపూడి మేరి కనకం ప్రమాదభరితంగా పొంగి ప్రవహిస్తున్న వాగుల వద్దకు వెళ్లి, స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలని ఆదేశించారు.

రైతుల్లో హర్షం

మండలంలోని వివిధ గ్రామాల్లో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఇప్పటి వరకు సాగుకు సరిపడా వర్షం కరవకపోవడంతో ప్రతి రోజు మేఘావృతమైన ఆకాశం వైపు అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు. పొలాల్లో విత్తనం జల్లడానికి సిద్ధమవుతున్నారు. మంగళవారం 42.2 మి.మీ., బుధవారం 40.8 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు వాతావరణ పరిశీలకులు బద్దిగం ఈశ్వరరెడ్డి తెలిపారు. ఆగస్టులో 150 మి.మీ. వర్షపాతానికి గానూ ఇప్పటికే 160 మి.మీ. నమోదైనట్లు పేర్కొన్నారు.

పొంగిన వాగులు, వంకలు

మాచవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. వాగులు పొంగి పొర్లుతున్నాయి. మండలంలోని శ్రీ రుక్మిణీ పురం వద్ద పీలేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. గాంధీనగరం వద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో రెండు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. పిన్నెల్లిలోని కొట్టేళ్ల వాగు, బుంగరవాగులు ప్రమాదకరంగా ప్రవహించాయి. వాగు పరీవాహక ప్రాంతాల్లో వరి నాట్లు నీట మునిగాయి. భారీ వర్షంతో ప్రమాదాలు జరగకుండా అధికారులు కూడా అప్రమత్తమయ్యారు.

పిడుగురాళ్లల్లో భారీ వర్షం

పిడుగురాళ్ల: గత రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు పిడుగురాళ్ల పట్టణ పరిసర ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పట్టణ ప్రజలంతా ఇళ్లకే పరిమితం కావాల్సిన పరిస్థితి నెలకొంది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తుండటంతో ప్రధాన రోడ్లన్నీ జలమయ్యాయి. పట్టణంలోని ఐలాండ్ సెంటర్, జానపాడు రోడ్డు, మున్సిపల్ కార్యాలయం రోడ్డు, అడితీల సెంటర్, అన్న క్యాంటిన్ తదితర ప్రాంతాల్లో రోడ్డుపై నీరు నిలిచింది. జగ్జీవన్‌రావు కాలనీ, ఆదర్శ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, రిక్షా కాలనీ, వీరమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో వర్షం నీటితో రోడ్లన్నీ జలమయ్యాయి. ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పంట పొలాల్లో మోకాళ్ల లోతు నీరు నిల్వ ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. షాపుల్లో వర్షం నీరు చేరి వ్యాపారులు అవస్థలు పడ్డారు.

మాచర్లలో భారీ వర్షం

మాచర్ల: భారీ వర్షానికి పట్టణమంతా జలమయమైంది. బ్రహ్మనాయుడు చెరువు, దేవాలమ్మ చెరువు, చంద్రవంకలో వర్షపు నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్ల పైకి డ్రెయినేజీ నీరు పొంగి పొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పట్టణ ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. గుంటూరు - నరసరావుపేట రోడ్డు జలమయం కావడంతో రవాణా సౌకర్యం ఆగిపోయింది. వర్షం వల్ల ముదురు పత్తి దెబ్బతింది.

కాలనీలను చుట్టుముట్టిన వర్షం నీరు

మాచర్ల రూరల్: మండలంలోని కొత్తపల్లి, కొప్పునూరు, నాగార్జునసాగర్ తదితర గ్రామాల్లో తహసీల్దార్ కిరణ్‌కుమార్ బుధవారం పర్యటించి, వాగులు, లోలెవల్ చప్టాలను పరిశీలించారు. కాలనీల చుట్టూ నిలిచిన వర్షపు నీటిని మళ్లించేందుకు తీసుకోవాల్సిన చర్యలను పంచాయతీ అధికారులకు వివరించారు. సీజనల్ వ్యాధుల నివారణ కోసం గ్రామాల్లో పారిశుధ్య పనులను చేపట్టాలని తెలిపారు.

విద్యుత్ సమస్యలపై ఎమర్జెన్సీ కాల్ సెంటర్ ఏర్పాటు

మాచర్ల: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.సింగయ్య బుధవారం తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 14 నుంచి 19వ తేదీ వరకు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున్న మాచర్ల విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఎమర్జెన్సీ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలు పడిపోయినా, వైర్లు తెగి పడినా కాల్ సెంటర్ నంబరు 9440817531కు సమాచారం తెలియజేయాలని ఆయన కోరారు.

పొంగి ప్రవహించిన రాళ్ల వాగు

కారెంపూడి: నర్సరావుపేట రోడ్డులో ఉన్న రాళ్ల వాగు (లిగంగుంట్ల బాడవ వాగు) పొంగి ప్రవహించింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి నుంచే వాగు ఉధృతి మొదలైంది. అది బుధవారం మరింత పెరిగి రోడ్డుపై నుంచి ప్రవహించింది. వాగు పరిస్థితిని తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, పోలీసులు పరిశీలించారు. ప్రజలు వాగు దాటకుండా, ప్రమాదాలు జరగకుండా బందోబస్తు నిర్వహించాలని పోలీసులకు సూచించారు. దీంతోపాటు జూలకల్లు వద్ద వాగు కూడా పొంగడంతో నర్సరావుపేట మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.



రాళ్ల వాగు ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్



కామేపల్లి- బ్రాహ్మణపల్లి గ్రామాల మధ్య రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



ఏడుమంగళం వాగు పొంగి ప్రవహించడంతో ముంపునకు గురైన వరి



గోలి గ్రామ శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



గోలి గ్రామ శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



పిడుగురాళ్ల ఐలాండ్ సెంటర్‌లో నిలిచిన నీరు



పిడుగురాళ్లల్లో పొంగి పొర్లుతున్న సైడు కాలవలు

కారెంపూడిలో కుండపోత

కారెంపూడి: మండలంలో మంగళవారం రాత్రంతా కుండపోత వర్షం పడింది. బుధవారం ఉదయం వరకు కూడా ఎడతెరిపి లేకుండా కురవడంతో మండలం అంతటా ఎక్కడ చూచినా జలమయంగా కనిపించింది. పొలాల్లో సైతం నీరు నిలిచిపోయింది. లోతట్టు, పల్లపు పొలాలు చెరువులను తలపించాయి. గ్రామాల్లో సైతం వీధులు జలమయం అయ్యాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. కారెంపూడిలో నాగులేరు వరద నీటితో ప్రవహిస్తోంది. శివారులో ఉన్న కబోధి వాగు, పేట సన్నెగండ్ల సమీపంలో రాళ్లవాగు రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్నాయి. వాగుల వల్ల చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఇటీవల వరకు నీరు లేక వెలవెలబోయిన చెరువులు నేడు నిండు కుండలా మారాయి. ఈ సీజన్‌లో ఇదే అతి పెద్ద వర్షం. పైగా బుధవారం సాయంత్రం కూడా మళ్లీ పడింది.



కారంపూడిలో పొలాల నుంచి బాట పైకి ప్రవహిస్తున్న వర్షం నీరు

పత్తికి తీవ్ర నష్టం

వర్షం నీరు పత్తి పంటను దెబ్బతీసింది. పత్తి విరుపులు స్తంభించిపోయాయి. పగిలిన కాయ తడిసిపోయింది. పక్వానికి వచ్చిన కాయలు బాగా తడవడం వల్ల కుళ్లిపోయే ప్రమాదం ఏర్పడింది. ఒక వేళ విచ్చుకున్నా గుడ్డి పత్తిగా మారే ప్రమాదం ఏర్పడింది. ఒక రకంగా వర్షం ముదురు పత్తి కాపు ముగించే పరిస్థితిని కల్పించింది. లేత పత్తికి వర్షం వల్ల పెద్దగా ఇబ్బంది లేదు. ఇక వరి సాగుకు సిద్ధం అవుతున్న రైతుల పొలాల నిండా నీరే నిలిచిపోయింది. నీరు పెట్టే పని లేకుండా ట్రాక్టర్లతో దమ్ము చేయిస్తున్నారు.



కారంపూడిలో నిమ్మ తోటలో నిలిచిన వర్షం నీరు



పిన్నెల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న కొట్టేళ్ల వాగు



మాచవరంలో పంట పొలాల్లో ప్రవహిస్తున్న వరద నీరు

చల్లగుండ్ల శ్రీరామ్మూర్తి కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు

పిడుగురాళ్ల: గురజాల పట్టణానికి చెందిన చల్లగుండ్ల శ్రీరామ్మూర్తి కుటుంబానికి రూ. 18.50 లక్షల చెక్కును పిడుగురాళ్ల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామ్మూర్తి గురజాల నియోజకవర్గంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. 2024లో మృతి చెందిన ఆయన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిడుగురాళ్ల శాఖలో శాశ్వత సభ్యత్వం కలిగి ఉండటంతో నేషనల్ సోషల్ సెక్యూరిటీ స్కీంకు అర్హులుగా పేర్కొన్నారు. జనవరి 7న రూ. 11,37,080 చెక్కును, ఐఎంఏ ఫ్యామిలీ బెనిఫిట్ స్కిమ్ సభ్యత్వం కలిగి ఉండటం వల్ల ఏప్రిల్‌లో రూ. 6,00,000 చెక్కును అందజేసినట్లు తెలిపారు. ఐఎంఏ డాక్టర్ ఎన్. అప్పారావు ఫ్యామిలీ సెక్యూరిటీ స్కీమ్ సభ్యత్వం కలిగి ఉండటం వల్ల బుధవారం నామినేషన్ ప్రకారం ధర్మపత్ని చల్లగుండ్ల విజయలక్ష్మీకి రూ. 9.25 లక్షలు, పెద్ద కుమారుడు డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్‌కి రూ. 9.25 లక్షల చెక్కును అందజేసినట్లు పేర్కొన్నారు. దీంతో బుధవారం నాడు వారి కుటుంబానికి మొత్తం రూ. 18.50 లక్షలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిడుగురాళ్ల శాఖ అధ్యక్షులు డాక్టర్ దూళ్లిపాళ్ల భరత్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ బొర్రా రాం ప్రసాద్, కోశాధికారి అలా సాంబశివరావు, డాక్టర్ ఎం. మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా

మాచర్ల: పురపాలక సంఘ సమావేశానికి కౌన్సిలర్లు గైర్హాజరవ్వడంతో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడిందని కమిషనర్ డి.వేణుబాబు బుధవారం వెల్లడించారు. ఎన్నికకు సంబంధించి ముందస్తుగా సమాచారం ఇచ్చినప్పటికీ కౌన్సిలర్లు గైర్హాజరవ్వడంతో గురువారానికి వాయిదా వేసినట్లు కమిషనర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎన్నిక ఉంటుందని, ఎన్నిక నిర్వహణకు ప్రత్యేక అధికారులు హాజరవుతారని వెల్లడించారు. కౌన్సిలర్లు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

డ్రగ్స్ రహిత సమాజానికి సమష్టిగా కృషి చేద్దాం



ర్యాలీలో డీఎస్పీ జగదీష్, సీఐ శ్రీనివాస్, విద్యార్థులు

గురజాల డీఎస్పీ జగదీష్

రెంటచింతల: డ్రగ్స్ నివారణలో అందరూ భాగస్వాములై డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సమష్టిగా కృషి చేద్దామని గురజాల డీఎస్పీ బీఎల్ఎం జగదీష్ అన్నారు. బుధవారం స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన డ్రగ్స్ నిర్మూలన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత మాదక ద్రవ్యాల జోలికి పోకుండా దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్‌కు ఆకర్షితులైతే భవిష్యత్ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. విద్యార్థి దశ నుంచే చెడు అలవాట్లకు దూరంగా ఉండి సన్మార్గంలో నడిచి మంచి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. డ్రగ్స్ నిర్మూలనకు ప్రజల సహకారం అవసరమని ఎక్కడైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గురజాల డీఎస్పీ జగదీష్, కారెంపూడి సీఐ శ్రీనివాస్ డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి అనంతరం గ్రామ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ సీహెచ్ నాగార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.